క్లుప్తంగా

నిరుపేద బాలింతకు ఆపన్నహస్తం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 9వ డివిజన్ పరిధిలోని చిన్నబాలయ్యనగర్ ప్రాంతానికి చెందిన నిరుపేద బాలింత బుజ్జమ్మకు అమ్మ యూత్ ఫౌండేషన్ నిర్వాహకుడు రమేష్ బాబు శుక్రవారం ఆపన్నహస్తం అందించారు. బుజ్జమ్మ మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆమెతో పాటు బిడ్డకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఫౌండేషన్ నిర్వాహకులు ఆమె ఇంటికి వెళ్లి బేబీకిట్, దోమతెర, నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు శరత్‌కుమార్, శశికిరణ్ పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్‌గా జాఫర్ బాధ్యతల స్వీకరణ

నెల్లూరు సిటీ: నెల్లూరు ప్రధాన స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ కార్యాలయంలో జాయింట్–2 సబ్‌రిజిస్ట్రార్‌గా జాఫర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ముత్తుకూరు సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన డిప్యూటేషన్‌పై నెల్లూరుకు వచ్చారు.

కానిస్టేబుల్‌కు అస్వస్థత

నెల్లూరు(దర్గామిట్ట) : కలెక్టరేట్‌లో విధి నిర్వహణకు వచ్చిన కానిస్టేబుల్ మల్లికార్జునరావు శుక్రవారం మధ్యాహ్నం అస్వస్థతకు గురయ్యారు. సహచర పోలీసు సిబ్బందితో పాటు కలెక్టరేట్ సిబ్బంది తక్షణమే స్పందించి 108 వాహనంలో కానిస్టేబుల్‌ను ఆస్పత్రికి తరలించారు.

మార్కెట్లోకి న్యూ స్విఫ్ట్ కారు



నెల్లూరు(అర్బన్): జెడ్ సిరీస్ ఇంజిన్‌తో కూడిన సరికొత్త మోడల్ మారుతి న్యూ స్విఫ్ట్ కారు నెల్లూరు మార్కెట్లోకి విడుదలైంది. నగరంలోని భార్గవి ఆటో మొబైల్స్‌లో యూనియన్ బ్యాంకు ఆర్‌ఎం రాజశేఖరం చేతుల మీదుగా న్యూ స్విఫ్ట్ కారును శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మెచ్చేలా అధునాతన డిజైన్‌తో విడుదల చేసిన నూతన కారులో ఎల్ఎక్స్ఐ నుంచి ఆరు ఎయిర్ బ్యాగ్స్ ఇవ్వడం ద్వారా మరింత రక్షణ కల్పించారని తెలిపారు. భార్గవి ఆటో మొబైల్స్ ఎండీ కొండా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ నూతన కారులో 22.86 సీఎం స్మార్ట్‌ప్లే, వైర్‌లెస్, ఆండ్రాయిడ్ ఆటో, హిల్ హోల్డ్ అసిస్టెయాక్సిస్‌తో వైడ్ యాంగిల్ పార్కింగ్ కెమెరా, సరికొత్త డిస్‌ప్లే, తదితర అత్యాధునిక ఫీచర్లు అందుబాటులో ఉంచినట్లు వివరించారు. తొమ్మిది రకాల రంగులలో కార్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మరో ముఖ్యఅతిథి ఇన్‌స్టాగామ్ ఇన్‌ఫ్లూయెర్ వెంకటేష్, కస్టమర్లు, ఫైనాన్సియర్లు, బీమా ప్రతినిధులు, భార్గవి ఆటో మొబైల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు, విద్యుత్ లైన్లకు అడ్డంగా ఉన్న చెట్లకొమ్మలను తొలగించే కార్యక్రమాలు చేపడుతున్న దృష్ట్యా నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగునని నెల్లూరుటౌన్ ఈఈ సోమశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు ముందస్తుగా ఏర్పాట్లు చేసుకుని సహకరించాలని కోరారు.

- ఆటోనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని న్యూమిలటరీ కాలనీ, కేశవులనగర్, జర్నలిస్టు కాలనీ, చైతన్యపురి కాలనీ, తదితర ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదు.
- పడారుపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ సుందరయ్య కాలనీ ఫీడర్‌లో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న దృష్ట్యా పడారుపల్లి, సుందరయ్య కాలనీ, బాబుజగ్జీవన్ రామ్ కాలనీ, సప్తగిరి కాలనీ, సప్తగిరి లేఅవుట్, రాజుకాంప్లెక్స్, జనశక్తినగర్, కళ్యాణ్‌నగర్, పాత వేదాయపాళెం పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదు.
- నవాబుపేట రైతుబజార్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ బోడిగాడితోట విద్యుత్‌ఫీడర్, కిసాన్‌నగర్ సెక్షన్ల పరిధిలో నూతనంగా 11 కేవీ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నందున బోడిగాడితోట, సత్యనారాయణపురం, శ్రీనివాసనగర్, లక్ష్మీపురం పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదు.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం



లక్ష్మీనరసింహస్వామి చప్పరోత్సవం



ధ్వజారోహణ చేసి గరుడ ప్రసాదాన్ని భక్తులకు పంచుతున్న వేదపండితులు

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ మండలం నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం ధ్వజారోహణం కార్యక్రమాన్ని శాస్త్రోకంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి గరుడ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా సంతానం లేని మహిళలకు గరుడ ప్రసాదాన్ని పంపిణీ చేశారు. అనంతరం చప్పరోత్సవం, గిరి ప్రదక్షణను నేత్రపర్వంగా నిర్వహించారు. నెల్లూరు వాస్తవ్యులు ప్రత్తి రమేష్‌బాబు జ్ఞాపకార్థంగా మనుమళ్లు సాయిహర్షితరమేష్, మిథిల్ రమేష్, కార్తీక్ వెంకట్, సోమిశెట్టి వెంకటసుబ్బయ్య ఉభయకర్తలుగా వ్యవహరించారు.

నేత్రపర్వంగా శేష వాహన సేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాయంత్రం శేష వాహన సేవను నేత్రపర్వంగా నిర్వహించారు. లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ మూర్తిని విశేషంగా అలంకరించి శేష వాహనంపై కొలువుదీర్చి క్షేత్రోత్సవం జరిపారు. సరస్వతి నాట్యమండలి వారి చెంచులక్ష్మి నాటకం, బాలత్రిపుర సుందరి వారి కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను అలరించాయి. ఉభయకర్తలుగా దేవరపాళెం వాస్తవ్యులు వేమిరెడ్డి హంసకుమార్‌రెడ్డి, లక్ష్మీకాంతమ్మ వ్యవహరించారు. ఆలయ ఈఓ వీ గిరికృష్ణ, అర్చక సిబ్బంది, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా త్రిపురాసుర అలంకారం



నెల్లూరు(బృందావనం): వైశాఖ మాసం సందర్భంగా మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో వసంతోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం రాత్రి మూలస్థానేశ్వరుడు త్రిపురాసుర అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరుడి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ఉత్సవం జరిపారు. ఉభయకర్తలుగా వెంకటేశ్వర్లు కుటుంబసభ్యులు వ్యవహరించారు. ఆలయ ఈఓ వేణుగోపాల్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎన్నికల కౌంటింగ్ కేంద్రం పరిశీలన



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

నెల్లూరు(దర్గామిట్ట): కనుపర్తిపాడులోని ప్రియదర్శిని కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం హరినారాయణన్, ఎస్పీ ఆరీఫ్‌హఫీజ్ శుక్రవారం పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి చివరి అంకమైన కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లపై సిబ్బందికి తగిన సూచనలు చేశారు. వారి వెంట ఎన్నికల, పోలీసు సిబ్బంది ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన



విశేషాలంకారంలో గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

నెల్లూరు(బృందావనం): జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మెక్లిన్స్‌రోడ్డు, విరాట్‌నగర్‌లోని గాయత్రిదేవి, విశ్వకర్మ భగవాన్, గోవిందమాంబ సమేత జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మందిరంలో విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సుప్రభాతసేవ, విశేషాభిషేకాలు, చందనాలంకారం, గణగణపతి పూజ, పుణ్యాహవచనం, బ్రహ్మకలశ స్థాపన, సకల దేవతల ఆహ్వానం, వీరబ్రహ్మేంద్రస్వామి సమాధి పూజ, మూర్తీ హోమం, సహస్ర నామార్చన, మహానివేదన, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం సుమారు రెండున్నర వేలమందికి పైగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం 6 గంటలకు సహస్రదీపాలంకరణ సేవను నేత్రపర్వంగా నిర్వహించారు. రాత్రి శ్రీగురుకృప కళాక్షేత్రం విద్యార్థులతో భరతనాట్య ప్రదర్శన, శ్రీలక్ష్మీనారాయణ కోలాటం బృందంతో కోలాట ప్రదర్శనలు నిర్వహించారు. పట్టణ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం శాశ్వత వ్యవస్థాపక అధ్యక్షుడు కందుకూరు చెంగయ్యఆచారి, ప్రధాన కార్యదర్శి ఇందుకూరు రమేష్‌కుమార్‌ఆచారి, శాశ్వత గౌరవాధ్యక్షుడు అలిమేలి సుబ్రహ్మణ్యంఆచారి, ఉపాధ్యక్షుడు అలిమేలి శ్రీహరిఆచారి, కోశాధికారి దండపాణిసురేష్ ఆచారి, దేవస్థానం పాలక మండలి సభ్యులు కందుకూరు జనార్దన్‌ఆచారి, బల్లవోలు రమణయ్యఆచారి, తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అధిక రక్తపోటుపై అవగాహన తప్పనిసరి



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

నెల్లూరు(అర్బన్): అధిక రక్తపోటు(బీపీ)పై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య సూచించారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక వైద్యశాఖ కార్యాలయం నుంచి సంతపేట వరకు శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో జరిగిన సదస్సులో బీపీ నియంత్రణకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ అధిక రక్తపోటు వల్ల అనేక అనర్థాలు తలెత్తుతాయన్నారు. బీపీ అనేది సైలెంట్ కిల్లర్ అని, తరచూ దానిని చెక్ చేయించుకుంటూ అదుపులో ఉంచుకుంటే ఎక్కువ కాలం జీవించవచ్చన్నారు. అధిక రక్తపోటు వల్ల కిడ్నీ, బ్రెయిన్ స్ట్రోక్, కంటి చూపునకు సంబంధించిన తీవ్రమైన సమస్యలు తలెత్తుతాయన్నారు. అందువల్ల బీపీని నియంత్రణలో ఉంచుకునేందుకు తగిన శారీరక శ్రమతో పాటు ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. అధిక బరువు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలి, నాన్ కమ్యూనికబుల్ డీసీజెస్, ఆర్‌బీఎస్కే ప్రోగ్రాం ఆఫీసర్ సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులను విక్రయిస్తే చర్యలు



స్వాధీనం చేసుకున్న నిషేధిత ప్లాస్టిక్‌తో ఎంహెచ్‌ఓ

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ పరిధిలో నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తుల క్రయ, విక్రయాలు చేపడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎంహెచ్‌ఓ వెంకటరమణ హెచ్చరించారు. స్టోన్‌హౌస్‌పేట ప్రాంతంలోని దుకాణాల్లో శుక్రవారం ఆయన తనిఖీలు చేపట్టారు. ట్రేడ్‌లైసెన్స్‌లను పరిశీలించారు. పలు దుకాణాల్లో రెండు టన్నుల నిషేధిత ప్లాసిక్‌ను స్వాధీనం చేసుకుని నిర్వాహకులకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఎంహెచ్‌ఓ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన నిషేధిత కాలుష్య కారక ప్రమాణాలను కార్పొరేషన్ పరిధిలో కఠినంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ప్లాస్టిక్ ఉత్పత్తుల విక్రయాలపై దాడులు నిర్వహించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. నిషేధిత సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ విక్రయాలపై సమీప సచివాలయం లేదా కార్పొరేషన్ కార్యాలయంలో సమాచారం అందించాలని నగర ప్రజలను కోరారు. కాలుష్య కారక ప్లాస్టిక్ వినియోగంపై ప్రజలంతా అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తూ వస్త్ర, జౌళి సంచులను మాత్రమే వినియోగించాలని కోరారు. శానిటేషన్ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

దీపం దొర్లి చెలరేగిన మంటలు

- రూ.3 లక్షల మేర ఆస్తి నష్టం

నెల్లూరు(క్రైమ్): దీపం దొర్లి మంటలు చెలరేగడంతో ఇంట్లోని వస్తువులు దగ్ధమైన ఘటన చంద్రమౌళీనగర్ నాల్గోవీధిలో శుక్రవారం చోటు చేసుకుంది. అగ్నిమాపక సిబ్బంది సమాచారం మేరకు..చంద్రమౌళీనగర్ నాల్గోవీధిలో వెంకటేశ్వరరెడ్డికి చెందిన రేకుల ఇంట్లో ఇంద్రాణి కుటుంబం అద్దెకు నివాసం ఉంటోంది. శుక్రవారం ఉదయం దీపారాధన చేసి ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. ఈ క్రమంలో దీపం దొర్లి పడిపోవడంతో పక్కనే ఉన్న బట్టలు అంటుకుని మంటలు చెలరేగాయి. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అయితే అప్పటికే ఇంట్లోని వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. ఇంద్రాణి కుటుంబం కట్టుబట్టలతో రోడ్డుపై పడింది. ఈ ఘటనలో సుమారు రూ.3 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

పోలీసు సిబ్బంది సంక్షేమానికి కృషి



పోలీసు సిబ్బంది సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ ఆరీఫ్‌హఫీజ్

నెల్లూరు(క్రైమ్): పోలీసు సిబ్బంది సంక్షేమానికి తన వంతు కృషి చేస్తున్నానని ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు వెల్ఫేర్ డేను శుక్రవారం నిర్వహించారు. సిబ్బంది నుంచి ఎస్పీ స్వయంగా అర్జీలు స్వీకరించి వారితో ముఖాముఖి మాట్లాడారు. సమస్యలను పరిష్కరిస్తామని భరోసానిచ్చారు. సిబ్బందితో పాటు వారి కుటుంబసభ్యులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించి అపరిష్కృతంగా ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పోలీసు కార్యాలయ మినిస్టీరియల్ సిబ్బందిని ఆదేశించారు. బాధ్యతాయుతంగా సిబ్బంది విధులు నిర్వహించాలని, అనధికారికంగా గైర్హాజరైతే క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో నిరంతర గస్తీ



నెల్లూరు(క్రైమ్): సార్వత్రిక ఎన్నికల సందర్భంగా నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా నగరంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ బీ అశోక్‌కుమార్ స్టేషన్ పరిధిలోని డైకస్‌రోడ్డు, కోటమిట్ట, షాదీమంజిల్, మెక్లిన్స్ రోడ్డు, ఖుద్దూస్‌నగర్, మన్సూర్‌నగర్, జెండా వీధి, తదితర ప్రాంతాల్లో నిరంతర పోలీసు గస్తీని ఏర్పాటు చేశారు. శుక్రవారం ఆయన సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితులను పరిశీలించారు. ఎన్నికల కోడ్ ఇంకా అమల్లో ఉందని, ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ముత్తుమారికి పవిత్ర జలాభిషేకం



కలశాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు

నెల్లూరు(బృందావనం): పొదలకూరురోడ్డులోని ఇందిరాగాంధీనగర్‌లో ఉన్న ముత్తుమారి దేవస్థానంలో అమ్మవారి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం అమ్మవారికి పవిత్ర జలాభిషేకం నిర్వహించారు. భక్తులు ఊరేగింపుగా పెన్నానది నుంచి 108 కలశాల్లో జలాలను తీసుకొచ్చి అభిషేకించారు. అనంతరం సంప్రదాయంగా విశేష పూజలు నిర్వహించారు. భక్తులు సుబ్రహ్మణ్యస్వామి శూలాలు ధరించి కావిడీలు మోశారు. సాయంత్రం లలితా సహస్రనామం, సామూహిక కుంకుమార్చన, విశేష భజనలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఆలయ నిర్వాహకులు ఎస్ గోపి పర్యవేక్షించారు.

నెల్లూరు సిటీలో 47 సర్వీసు ఓట్లు



పోస్ట్‌మెన్ నుంచి పోస్టల్ బ్యాలెట్‌ను అందుకుంటున్న ఆర్వో వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): నెల్లూరు సిటీ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో నివాసం ఉంటూ మిలటరీలో విధులు నిర్వహిస్తున్న వారిని గుర్తించి ఎన్నికల అధికారులు ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించారు. నెల్లూరు సిటీ పరిధిలో 47 మంది సర్వీసు ఓటర్లు ఉండగా, వారికి బ్యాలెట్ పత్రాలను పోస్టల్ ద్వారా పంపించారు. వాటిని అందుకున్న వారిలో ఇప్పటి వరకు ఏడుగురు తమ ఓటును నమోదు చేసి తిరిగి ఆర్వో వికాస్‌మర్మత్‌కు పంపారు. ఆయా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను కార్పొరేషన్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములో భద్రపరుస్తున్నారు. ఏ రోజుకారోజు వచ్చిన సర్వీసు ఓట్ల వివరాలను జిల్లా ఎన్నికల అధికారికి తెలియజేస్తున్నారు. శుక్రవారం పోస్టల్ ద్వారా వచ్చిన సర్వీసు ఓట్లకు సంబంధించిన కవర్‌ను పోస్టుమెన్ ద్వారా అందుకున్న ఆర్వో వికాస్‌మర్మత్ వాటిని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచి సీల్ వేశారు. ఓట్లు లెక్కింపునకు ఒక్కరోజు ముందు సర్వీసు ఓట్లను పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో కలిపి మొత్తం ఓట్లతో పాటు లెక్కించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డీటీ స్వర్ణ, రెవెన్యూ అధికారిణి రాజేశ్వరి, చక్రపాణి, పలువురు రాజకీయపార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఊరెళ్తున్నారా..నిశ్చింతగా వెళ్లిరండి

- ఎల్‌హెచ్‌ఎంఎస్‌తో మీ ఇంటికి భద్రత
- దొంగలు పడకుండా పోలీసుల నిరంతర నిఘా



నెల్లూరు(క్రైమ్): వేసవి సెలవుల్లో బంధువులు, మిత్రుల ఊర్లకు వెళ్లి కొద్ది రోజులైనా సరదాగా గడపాలని నగర ప్రజలు భావిస్తుంటారు. అలాంటి వారు తమ ఇళ్ల భద్రతపై కాసింత ఆందోళన చెందుతుంటారు. ఇంట్లో ఎవ్వరూ లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని దొంగలు విజృంభించే అవకాశం ఉందన్న ఆందోళన వారిని వెంటాడుతోంది. ఈ పరిస్థితుల్లో ఇంటి యజమానులు భయపడాల్సిన అవసరం లేదని పోలీసు అధికారులు చెబుతున్నారు. ఊర్లకు వెళ్లేవారు పోలీసుశాఖ రూపొందించిన లాక్డ్‌హౌస్ మానిటరింగ్ సిస్టం(ఎల్‌హెచ్‌ఎంఎస్) సేవలను సద్వినియోగం చేసుకుంటే దొంగతనాలను అరికట్టవచ్చని సూచిస్తున్నారు. స్మార్ట్‌ఫోన్‌లోని గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆ తరువాత యాప్‌లో వ్యక్తిగత వివరాలు, సెల్ నంబర్ పొందుపరచాలి. మొబైల్ నంబర్‌కు వచ్చిన ఓటీపీని ఎంటర్ చేయగానే యూనిక్ ఐడీ జనరేట్ అవుతుంది. ఈ ప్రక్రియతో ఎల్‌హెచ్‌ఎంఎస్ రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లే వారు ముందుగా ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌లోకి వెళ్లి రిక్వెస్ట్ పోలీస్‌వాచ్‌ను ఎంపిక చేసుకోవాలి. ఏ తేదీ ఏ సమయానికి ఊరు వెళుతున్నారు? తిరిగి ఎప్పుడు వస్తారు? అన్న వివరాలు యాప్‌లో పొందుపరచాలి. వెంటనే ఆ సమాచారం జిల్లా పోలీసు కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్‌రూమ్‌కు చేరుతుంది. అక్కడి సిబ్బంది ఇంటికి వచ్చి పైసా ఖర్చులేకుండా వైర్‌లెస్ మోషన్ కెమెరా, మోడెమ్‌ను ఇంటికి అమర్చి కమాండ్ కంట్రోల్‌రూమ్‌కు అనుసంధానం చేస్తారు. ఆ ఇంట్లో ఎలాంటి కదలికలు ఉన్నా కమాండ్ కంట్రోల్‌రూమ్‌కు సంకేతాలు పంపడంతో పాటు అలారం మోగుతుంది. వెంటనే సంబంధిత పోలీసు స్టేషన్, రక్షక్, బ్లూకోల్ట్స్ మొబైల్‌కు సమాచారం వెళుతుంది. వారు అప్రమత్తమై దొంగలు చొరబడ్డ ఇంటికి చేరుకుని వారిని పట్టుకునే అవకాశం ఉంది. దీంతో నేరం జరగకముందే అరికట్టినట్లు అవుతుంది. ఆండ్రాయిడ్, స్మార్ట్‌ఫోనులు లేని వారు నేరుగా పోలీసుస్టేషన్‌కు వెళ్లి సమాచారం అందిస్తే ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను ఏర్పాటు చేస్తారు.

దొంగతనాలను అరికట్టవచ్చు



ఊర్లకు వెళ్లేవారు ఎల్‌హెచ్‌ఎంఎస్ ద్వారా రిక్వెస్ట్ పెడితే ఆ ఇంట్లో కెమెరాలను ఏర్పాటు చేస్తాం. ఊరు వెళ్లి తిరిగి వచ్చే వరకు దొంగతనం జరగకుండా నిఘా ఉంటుంది. ఇప్పటికే వీటి ద్వారా పలుచోట్ల చోరీచేసే క్రమంలో దొంగలను పట్టుకున్నాం. ఇళ్లకు తాళాలు వేసి వెళుతున్నప్పుడు ఇంట్లో విలువైన వస్తువులు, నగదు ఉంచవద్దు. బ్యాంకు లాకర్లలో జాగ్రత్త చేసుకోవడం మంచిది.

– డీ శ్రీనివాసరెడ్డి, నగర డీఎస్పీ

ప్రమాదభరితంగా ట్రాన్స్‌ఫార్మర్



దిమ్మె ఒరిగిపోయి కూలేందుకు సిద్ధంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 54వ డివిజన్ జనార్దన్‌రెడ్డికాలనీలో మెయిన్ రోడ్డు పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదభరితంగా ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన దిమ్మె ఒరిగిపోయి ఏ సమయంలోనైనా కూలేందుకు సిద్ధంగా ఉంది. ఇదే జరిగితే దిమ్మెపై ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ పడిపోయి విద్యుత్ లైన్లు తెగిపోయి ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. విద్యుత్ అధికారులు స్పందించి ఎలాంటి ప్రమాదం జరగముందే సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

